# గాంధి

సలీం

ప్రముఖ వార పత్రికలో గాంధి రాసిన వ్యాసం చదవటం పూర్తవగానే కళ్ళు చెమర్చాయి. అడవిని నమ్ముకుని బతుకుతున్న జాతుల కడగండ్లని ఎంత బాగా రాశాడో... హృదయానికి హత్తుకునేలా... మనసు ద్రవించేలా. అలా రాయగలగటం గాంధి లాంటి నిబద్ధతగల వ్యక్తులకే చాతనవుతుంది. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణాలైనా యివ్వడానికి తయారయ్యే మనిషి అతను. ఆంధ్ర రాష్ట్రంలో అతనికి చాలామంది అభిమానులున్నారు. మానవత్వాన్ని చాటుతూ అతను రాసే కథల కోసం, నిజాన్ని నిర్భయంగా వెల్లడించే అతని వ్యాసాల కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూసే అభిమానులు... నేనూ అతని అభిమానినే. ఎటొచ్చీ అతను నాకు స్వయానా అన్న కావటమే నేను చేసుకున్న అదృష్టం.

గాంధి నాకంటే వయసులో రెండేళ్ళ పెద్ద. గాంధి చిన్న వయసులోనే చాలా పెద్దరికంతో వ్యవహరించేవాడని అమ్మ చెప్పేది. 'ముదురు మాటలూ వీడూ' అంటూ నానమ్మ మురిసిపోతే, 'వేలెడంత లేడు వీడికెందుకటా అనవసరమైన ఆరాలన్నీ' అంటూ బంధువర్గం చెవులు కొరుక్కునేవారట. బిచ్చగాళ్ళని, పేదవాళ్ళని చూసి 'వాళ్ళెందుకలా ఉన్నారు? మనలా ఎందుకు లేరు? మనకూ వాళ్ళకూ ఎందుకింత వ్యత్యాసం? ఎవరు కారణం' లాంటి ప్రశ్నలడిగి నాన్నని విసిగించేవాడట.

నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడు జరిగిన సంఘటన బాగా గుర్తుండిపోయింది. స్కూలు వదిలాక పిల్లలందరం పొలోమని అరుచుకుంటూ స్కూలు బైటికొచ్చాం. రోడ్డువారగా ఉన్న చెట్టు కింద నిలబడి ఉందో పిచ్చిది. చిరిగి పీలికలైన వస్త్రాన్ని చీరలా చుట్టుకుని, చింపిరి జుట్టుని వేళ్ళతో కెలుక్కుంటూ దైన్యానికి ప్రతిరూపంలా నిలబడి ఉందామె. పిల్లలు కొంతమంది ఆమెను ఆటపట్టిస్తూ సతాయించడం మొదలెట్టారు. ఆమె కోపంతో తిడ్తూ కొట్టడానికి వెంటబడితే నవ్వుకుంటూ పారిపోవటం... మళ్ళా వెనక్కొచ్చి ఆమెని ఏడ్పించడం... ఆమె రాయి తీసుకుని విసిరింది. అంతే. పిల్లలు కూడా రాళ్ళు తీసుకుని ఆమె వైపు విసిరారు. రాళ్ళు తగిలి ఆమెకు గాయాలౌతున్నాయి... పిల్లలు యింకా రెచ్చిపోయి గురి చూసి రాళ్ళు విసుర్తున్నారు.

అది చూసిన గాంధి 'ఆపండ్రా' అంటూ పెద్దగా హూంకరించాడు. పిల్లల్తో కలబడి వాళ్ళ చేతుల్లోని రాళ్ళని లాక్కున్నాడు. 'ఆమె పిచ్చిది. అలాంటి వాళ్ళని దయగా చూడాలని తెలీదా మీకు? మీకూ పిచ్చయితే అలానే రాళ్ళు విసరండి' అన్నాడు. రాయి విసరబోతున్న పిల్లలు కూడా ఆ మాట విని ఆగిపోయారు. గాంధి ఉగ్ర స్వరూపం చూశాక నాకో విషయం స్పష్టంగా తెల్సింది. మా అన్న మేము పుస్తకాల్లో చదువుకున్న గాంధి మహాత్ముడిలా శాంతి, సహనం అనే రకం కాదని... అవసరమైతే ఆరో



రుద్రుడిలా తిరగబడ్తాడని...

యింటికొచ్చాక జరిగిన విషయం నాన్నకు చెప్తే కలవరపడ్డాడు. 'పిల్లలేదో చేస్తే నీకెందుకురా? నీ మానాన నువ్వు బుద్ధిగా యింటికి తిరిగి రావొచ్చుగా... వాళ్ళతో గొడవ దేనికి?' అన్నాడు.


'అలా అంటావేమిటి నాన్నా... అన్యాయంగా ఆ పిచ్చిదాన్ని కొడ్తుంటే చూస్తూ వూర్కోమంటావా... నాకేమీ సంబంధం లేనట్టు ఉండమంటావా... నాచేత కాదు, కళ్ళముందు జరుగుతున్నదాన్ని చూస్తూ సహించలేను' అన్నాడు అన్న.

'పిల్లలు నలుగురైదుగురు కలిసి నీ మీద పడి కుమ్మేస్తే ఏమైపోయేవాడివిరా? నా బాధంతా నీ గురించేరా. నీకు కష్టమో నష్టమో జరిగితే తట్టుకోలేనురా' అన్నాడు నాన్న.

'నాకేదో ప్రమాదం జరుగుతుందని భయపడి పిరికివాడిలా జరుగుతున్న ఘోరాన్ని ఎదిరించకుండా పారిపొమ్మంటావా?' అన్నాడు.

వాడు పదో తరగతిలో ఉన్నప్పుడు నాతో 'జీవితం చాలా విలువైంది తెలుసా... అందులోనూ మానవ జీవితం చాలా ఉన్నతమైంది. దానికి సార్థకత చేకూర్చటమే మనిషిగా మన కర్తవ్యం' అనేవాడు. యింటర్ చదువుతున్నప్పుడు 'జీవితం విలువ మనం ఎలా జీవిస్తున్నాం, ఎందుకు జీవిస్తున్నాం, ఎవరికోసం జీవిస్తున్నాం అనే ప్రశ్నల సమాధానాల మీద ఆధారపడి ఉంటుంది తమ్ముడూ. నాకైతే అశేష పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడాలని ఉంది. దేశాన్ని క్యాన్సర్ మహమ్మారిలా పట్టి పీడిస్తున్న అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఉంది' అనేవాడు.

నేను డిగ్రీ చదివాక బిజినెస్



మేనేజ్‌మెంట్‌లో కోర్సు పూర్తి చేసి రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో దిగి బాగా సంపాయించాను. అన్న మాత్రం డిగ్రీ కాగానే ఉన్న వూర్లోనే టీచర్ ఉద్యోగంలో చేరిపోయాడు. పెద్ద కొడుకు ప్రయోజకుడు కాలేదని బాధపడ్తున్న నాన్నతో 'నేను నా ఆలోచనల్ని, ఆశయాల్ని పది మందికి పంచడానికి అవకాశమున్న ఉద్యోగం యిదే. విద్యార్థులే భావి భారత పౌరులు. వాళ్ళను మానవత్వమున్న వ్యక్తులుగా తీర్చిదిద్దటంలో నా వంతు సహకారాన్ని అందిస్తాను నాన్నా. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి డబ్బులు సంపాదించాలన్న కోరిక లేదు. నా మనసుకు నచ్చిన ఉద్యోగం చేయనివ్వండి' అన్నాడు.

మా అన్న నాకు నిజ జీవితంలో తారసపడే హీరోలా అన్పిస్తాడు. వ్యాసం చదివినప్పటి నుండి అన్న దగ్గరకెళ్ళాలని అనుకున్నా వ్యాపార లావాదేవీల్లో బిజీగా ఉండటం వల్ల కుదర్లేదు. ఈ రోజు ఆదివారం. మేము పెళ్ళిళ్ళు చేసుకుని వేరు వేరుగా ఉన్నా వారాని కొక్కసారైనా అన్న యింటికెళ్ళి మాట్లాడకపోతే ఏదో వెలితిగా ఉంటుంది.

బయల్దేరబోతున్నప్పుడు మా రెండో అమ్మాయి "నాన్నా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పవా" అని అడిగింది. తనిప్పుడు బ్యాంకు ఉద్యోగాల కోసం అర్హత పరీక్షలు రాస్తోంది. అందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్ కూడా ఉంటుందట. ప్రశ్న దానికి సంబంధించిందే.

'లాయర్లు నల్లకోటు వేసుకుంటారు. డాక్టర్లు తెల్లకోటు వేసుకుంటారు. కాబట్టి నల్లకోటు వేసుకున్న వాళ్ళందరూ లాయర్లు, తెల్లకోటు వేసుకున్న వాళ్ళందరూ డాక్టర్లు అనటం కరెక్టా కాదా' అనేది ప్రశ్న.

"కరెక్ట్ కాదమ్మా. నల్లకోటు వేసుకున్న వాళ్ళలో లాయర్లు ఉండొచ్చు. తెల్లకోటు వేసుకున్న వాళ్ళలో డాక్టర్లు ఉండొచ్చు. కానీ నల్లకోటు వేసుకున్న వాళ్ళందరూ లాయర్లు కాదు. తెల్లకోటు వేసుకున్న వాళ్ళందరూ డాక్టర్లు కాదు" అన్నాను.

"యిలాంటి ప్రశ్నలు చాలా కన్‌ఫ్యూజింగ్‌గా ఉన్నాయి నాన్నా. యిచ్చిన యిన్ఫరెన్స్ ఏది చదివినా కరెక్టేనేమో అన్పించేలా ఉంది" సిగ్గుపడుతూ.

"జీవితంలో కూడా చాలా సందర్భాలు యిలాంటివి ఎదురవుతాయి తల్లీ. విజ్ఞతతో ఆలోచిస్తే మనకు సరైన సమాధానం దొరుకుతుంది" అన్నాను.

నేను వెళ్ళేటప్పటికే ఎప్పటికిమల్లే అన్న చుట్టూ పది మంది కూచుని అతను చెప్పేది శ్రద్ధగా వింటున్నారు. వాళ్ళందరూ అన్న చేసే సామాజిక కార్యక్రమాలన్నిట్లో చురుగ్గా పాల్గొనే కార్యకర్తలు. నేనూ వాళ్ళతో పాటు కూచున్నా.

"పర్యావరణాన్ని కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఈ రోజు వరల్డ్ ఎర్త్ డే. మన భూమిని జల, వాయు కాలుష్యాల నుంచి, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ నుంచి రక్షించుకోకపోతే మన ముందు తరాల వారికి మనం అందించేది పచ్చగా కళకళలాడే నేలని కాదు... ఎర్రగా కణకణ మండే అగ్నిగోళాన్ని. అందుకే మనం ఈ రోజు నుండి పచ్చదనాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా విస్తారంగా పర్యటించి మొక్కలు నాటుదాం. మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతని విద్యార్థులకు అర్థమయ్యేలా చెబ్దాం" అన్నాడు.

కార్యకర్తలు వెళ్ళిపోయాక యిద్దరం పిచ్చాపాటిలో పడ్డాం.

"వేశ్యల జీవితాల్లో మార్పు తీసుకురావాలని ఆర్నెల్ల క్రితం ఓ ఉద్యమాన్ని చేపట్టావు కదా. ఏమైందన్నయ్యా" అని అడిగా.

"ప్లీజ్ తమ్ముడూ. వాళ్ళని ఆ పేరుతో పిలవకు అవమానించినట్టుంటుంది. తమ శరీరాల్నీ ఆరోగ్యాన్నీ పణంగా పెట్టి పొట్టకూటి కోసం నానా తిప్పలు పడ్తుంటే ఈ పోలీసులు రెయిడింగ్‌లంటూ సతాయించటం అన్యాయం కాదా...

**"పర్యావరణాన్ని కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఈ రోజు వరల్డ్ ఎర్త్ డే. మన భూమిని జల, వాయు కాలుష్యాల నుంచి, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ నుంచి రక్షించుకోకపోతే మన ముందు తరాల వారికి మనం అందించేది పచ్చగా కళకళలాడే నేలని కాదు... ఎర్రగా కణకణ మండే అగ్నిగోళాన్ని. అందుకే మనం ఈ రోజు నుండి పచ్చదనాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా విస్తారంగా పర్యటించి మొక్కలు నాటుదాం. మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతని విద్యార్థులకు అర్థమయ్యేలా చెబ్దాం"**

మామూళ్ళు తీసుకోవటం అమానుషం కాదా... మొన్న టీవీలో ఒక మ్మాయి యింటర్వ్యూ యిచ్చింది చూసావా... పోలీసులు లంచాలే కాదు వాళ్ళ శరీరాల్ని కూడా ఫ్రీగా వాడుకుంటారట. అదేమని ఎదురు తిరిగితే ఏదో ఓ కేస్‌లో యిరికించేస్తామని బెదిరిస్తారట. ఏ డబ్బు కోసం వాళ్ళావృత్తి చేపట్టారో ఆ డబ్బుల్ని గుంజుకోవటం మహాపరాధం కాదా. అందుకే వాళ్ళ తరఫున కోర్టులో కేస్ వేశా. ఆ వృత్తిలో ఉన్న స్త్రీలని పోలీసులు అరెస్ట్ చేయకూడదని, దాన్ని నేరంగా పరిగణించరాదని కోర్టుని కోరుతున్నాం. తప్పు వాళ్ళది కాదు. పేదరికానిది తప్పు. వాళ్ళ ఆకలిది తప్పు. నేరం అనుకుంటున్న దాని మూలాల్ని ప్రక్షాళించకుండా బాహ్యంగా కన్పిస్తున్న దాని నేరమని చెప్పి శిక్షించటం బాధాకరమైన విషయం. బాగా గుర్తు చేశావు. రేపు వెళ్ళి లాయర్ని కల్సుకుని ప్రోగ్రెస్ కనుక్కోవాలి" అన్నాడు.

అన్న పదో తరగతిలో ఉన్నప్పుడు రమణయ్య మేష్టారితో పోట్లాడిన విషయం గుర్తొచ్చింది. తన క్లాస్‌మేట్ వెంకటేష్‌ని జామెట్రి


బాక్స్ తీసుకురాలేదని రమణయ్య మేష్టారు కొట్టారట. వెంకటేష్ నోరెత్తకుండా తన్నులు తింటుంటే మా అన్న లేచి నిలబడి మేష్టార్ని నిలదీశాడట. ఆ విషయం గుర్తు చేయగానే అన్న మొహంలో సన్నటి చిర్నవ్వు మొలిచింది. అన్న నవ్వటం చాలా అరుదు. ఎప్పుడోగాని నవ్వడు. అదే విషయం ఓసారడిగితే 'మనం బతుకుతున్న సమాజంలో పరిస్థితులు యింత భయంకరంగా, చండాలంగా ఉంటే నవ్వెట్లా వస్తుంది? స్వార్థ రాజకీయ నాయకుల చేతుల్లో ప్రజాస్వామ్యం వూపిరాడకుండా నలిగిపోతుంటే, మన జీవితాలు నవ్వులపాలై పోతుంటే చూసి ఏడుపొస్తుంది తప్ప నవ్వేలా వస్తుంది' అన్నాడు.

"రమణయ్య మేష్టారు మంచివాడే. కానీ ఆ రోజు అతను చేసింది తప్పు. జామెట్రీ బాక్స్ కొనడానికి డబ్బు లేకపోతే వెంకటేష్ ఏం చేస్తాడు చెప్పు? నీకు తెల్సుగా వెంకటేష్ వాళ్ళ నాన్న కూలిపని చేసేటోడు. ఆ వచ్చిన కాసిని డబ్బుల్ని కూడా తాగి తగలేసేవాడు. మాష్టారితో నేనదే అన్నాను. వాళ్ళ నాన్నని పిలిచి ఎందుకు తాగుతున్నావని కొట్టమని చెప్పాను. వాళ్ళ పేదరికాన్ని బెత్తంతో బాదమని చెప్పాను. వెంకటేష్‌ని కొడ్తే ప్రయోజనం మాట అటుంచి పర్యవసానం మరోలా ఉంటుంది. ఎలాగూ వాడి నాన్న జామెట్రీ బాక్స్ కొనడానికి డబ్బులివ్వడు. మేష్టారు కొడ్తాడన్న భయంతో వాడు స్కూలు మానేస్తాడు. వాడికి చదువు చాలా అవసరం. దాన్నుంచి వాడిని దూరం చేసే అధికారం మాష్టారికెక్కడుంది?" అన్నాడు.

**అన్న నవ్వటం చాలా అరుదు. ఎప్పుడోగాని నవ్వడు. అదే విషయం ఓసారడిగితే 'మనం బతుకుతున్న సమాజంలో పరిస్థితులు యింత భయంకరంగా, చండాలంగా ఉంటే నవ్వెట్లా వస్తుంది? స్వార్థ రాజకీయ నాయకుల చేతుల్లో ప్రజాస్వామ్యం వూపిరాడకుండా నలిగిపోతుంటే, మన జీవితాలు నవ్వులపాలైపోతుంటే చూసి ఏడుపొస్తుంది తప్ప నవ్వేలా వస్తుంది' అన్నాడు.**

"మేష్టారు నిన్ను కొట్టడానికొచ్చాడట కదా"

"ఔను. బచ్చాగాడివి నువ్వా నాకు నీతులు చెప్పేది అంటూ వెంకటేష్ని వదిలేసి నన్ను కొట్టడానికొచ్చాడు. నేను చేతులు కట్టుకుని 'మీ కసి తీరా కొట్టండి. భరిస్తాను. కానీ నేను చెప్పింది సబబో కాదో ఓ క్షణం ఆలోచించండి. మీకు దయాగుణం ఉంటే మీరే ఓ జామెట్రీ బాక్స్ కొనివ్వండి. లేకపోతే మా క్లాస్‌లో అందరి దగ్గరా డబ్బులు పోగేసి మేమే కొంటాం. అతని సమస్యకి పరిష్కారం చూపించకుండా కొడ్తే ఏం చేస్తాడు సార్. వాళ్ళ నాన్నతో పోట్లాడలేడుగా. పోట్లాడినా వాళ్ళ నాన్న చేతుల్లో మళ్ళా తన్నులు తినటం తప్ప లాభమేం ఉండదు సార్. నేను మీకంటే చాలా చిన్నవాడిని. నిజమే సార్. కాని నిజం చెప్పడానికి వయసుతో పనేం ఉంది' అన్నాను. నా వైపు కొరకొరా చూసి ఏమనుకున్నాడో ఏమో కొట్టకుండానే వెళ్ళిపోయాడు".




"మరునాడు జామెట్రీ బాక్స్ తనే కొని వెంకటేష్‌కిచ్చాడు కదా"

"ఔను. చెప్పాగా. మనిషి స్వతహాగా మంచివాడని. ఏదో ఉద్రేకంలో అలా ప్రవర్తించాడు. అటువంటి సమయంలో ఓ సరైన మాట, సరైన సలహా మనిషిని మరలా మంచితనం వైపుకు నడిపిస్తాయి".

అన్న దగ్గర శెలవ తీసుకునే ముందు "రేపో ఎల్లుండో వదిన్ని పిల్లల్ని పిల్చుకుని మా యింటికి భోజనానికి రా అన్నాయ్యా. మీరొచ్చి చాలా రోజులైందని లక్ష్మి కూడా అంటోంది" అన్నాను.



"రేపు వీలు కాదులే. పని మీద నిర్మల్ వెళ్తున్నా. అక్కడి కార్మికుల సమస్యల్ని ప్రత్యక్షంగా చూసి ఓ వ్యాసం రాయాలనుకుంటున్నాను. బుధవారం తిరిగొస్తాను. అప్పుడు తప్పకుండా వస్తానని తనతో చెప్పు" అన్నాడు.

***

గురువారం ఉదయం ఎనిమిది గంటలు... కాలింగ్ బెల్ మోగితే వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా వదిన...

"రా వదినా... అన్నయ్యేడీ" అంటూ మెయిన్ గేట్ వైపు చూశాను. అన్నయ్య జాడ లేదు.

"ఆయన నిన్న రావాల్సింది. ఈ రోజు కూడా రాకపోతే కంగారు పడి నీ దగ్గరకొచ్చాను" అంది. అప్పుడు గమనించాను ఆమె మొహంలో దిగుల్ని... రాత్రంతా నిద్ర లేనట్టు మొహం పీక్కుపోయి ఉంది.

"మామూలే కదా వదినా. యిలా ఎన్నిసార్లు జరగలేదూ? రెండ్రోజులని వెళ్ళి వారం రోజులు మకాం వేసిన సందర్భాలు కూడా ఉన్నాయి కదా. నీకు తెలీదా అన్నయ్య స్వభావం? దీనికే కంగారు పడితే ఎలా" అన్నాను.

తను సోఫాలో నిస్త్రాణగా కూలబడింది. "నిజమే. యిలా చాలా సార్లే జరిగింది. కానీ ఎప్పుడూ తన ఫోన్ యిరవై నాలుగు గంటలు స్విచాఫ్ చేసి పెట్టలేదు. నిన్న ఉదయం ఫోన్ చేసారు. పని ఐపోవచ్చిందనీ సాయంత్రం బయల్దేరతాననీ చెప్పారు. ఆ తర్వాత నేనెన్ని సార్లు ఫోన్ చేసినా రెస్పాన్స్ లేదు. యిలా ఎప్పుడూ జరగలేదు. నా మనసేదో కీడుని శంకిస్తోంది" అంది చీర కొంగుతో కళ్ళని వొత్తుకుంటూ.

"ఎన్నో కారణాల వల్ల అలా జరిగి ఉండొచ్చుగా వదినా. సెల్ పోయిందేమో... సెల్ పాడైందేమో. నువ్వు అనవసరంగా కంగారు పడ్తున్నావు. రేపొచ్చేస్తాడు చూడు".

"అలా జరిగితే అక్కడి ల్యాండ్ లైన్నుంచయినా ఫోన్ చేస్తారు. తను ఎక్కడున్నా ఏ పరిస్థితుల్లో ఉన్నా రోజుకి కనీసం రెండు మూడు సార్లు ఫోన్ చేయకుండా మీ అన్నయ్య ఉండలేరు. తన నుంచి ఫోన్ రాకపోతే నేను కంగారుపడ్తానని ఆయనకి తెలుసు".

నా సెల్ ఫోన్లోంచి రెండు సార్లు ప్రయత్నించాను. నాట్ రీచబుల్ అనే వస్తోంది.

"నిర్మల్‌లో నాకు తెల్సినవాళ్ళున్నారు వదినా. వాళ్ళకు ఫోన్ చేసి కనుక్కుంటాలే. నువ్వు వర్రీ కాకు" వదిన్ని యింటి దగ్గర డ్రాప్ చేస్తూ ధైర్యం చెప్పాను.

నా ప్రయత్నాల వల్ల ఫలితమేమీ కన్పించలేదు.

మరునాడుదయం వదిన్నుంచి ఫోనొచ్చింది. అర్జెంటుగా రమ్మని... వదిన ఏడుపు స్పష్టంగా విన్పిస్తోంది. విషయమేంటో చెప్పకుండానే ఫోన్ పెట్టేసింది.

నేను క్షణం ఆలస్యం చేయకుండా బయల్దేరాను. నన్ను చూడగానే వదిన మరింత బిగ్గరగా ఏడుస్తూ "మీ అన్నను చంపేశారు... పోలీసులు కాల్చి చంపేవారు" అంది.

"పోలీసులు కాల్చటమేమిటొదినా... స్పృహలో ఉండే మాట్లాడ్తున్నావా" నా మాట పూర్తి కాకముందే ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తని నాకు చూపించింది.

'ఆదిలాబాద్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో గాంధి అనే నక్సలైట్ మృతి'

ఆ వార్త చదవగానే వళ్ళంతా చెమటతో తడిచిపోయింది. గొంతు తడారిపోయింది. శరీరం సన్నగా వణకటం నాకు తెలుస్తోంది. ఆ షాక్ నుంచి తేరుకోడానికి కొన్ని నిముషాలు పట్టింది. మెదడు సరిగ్గానే పని చేయటం ప్రారంభించింది. ఉత్తినే ఎలా భయపడ్డానో తల్చుకుని నవ్వొచ్చింది.

"అనవసరంగా నువ్వు భయపడి నన్ను భయపెట్టేశావు వదినా. ఆ వార్తలో ఉన్న గాంధి మన గాంధి కాదు. నక్సలైట్లలో గాంధి అనే పేరున్న నక్సలైట్ పోలీసు కాల్పుల్లో చనిపోయాడు. అంతే".

"లేదు. నాకేదో అనుమానంగా ఉంది. మీ అన్ననే పట్టుకెళ్ళి నక్సలైట్ అనే ముద్రేసి అడవుల్లో కాల్చేశారేమో"

"అందుకు అవకాశమే లేదు. అసలు అన్ననెందుకు అరెస్ట్ చేస్తారు? చేసినా నక్సలైట్ అని ఏ ఆధారాలు లేకుండా ఎలా అనుకుంటారు? ఓ వేళ పొరపాటుగా అనుకున్నా తమ అనుమానాన్ని నిర్ధారించుకోకుండా తొందరపడి ఎందుకు కాల్చేస్తారు? నువ్వు

నిజామాబాద్ చేరుకోగానే పోలీస్ స్టేషన్లో వాకబు చేశాం. మార్చురీలో ఉన్న శవాన్ని చూపించారు. అన్నదే. వదినా నేను అన్న శవం మీద పడి ఎంత ఏడ్చినా దుఃఖం తీరటం లేదు. ఈ బాధ, దుఃఖం ఎప్పటికైనా తీరేటివా? మా అన్నను నక్సలైట్ అనుకుని చంపేయటమేమిటి?



చెప్పేదేదీ లాజిక్కి అందటం లేదొదినా... నా మాట నమ్ము. అన్న ఎక్కడో క్షేమంగా ఉంటాడు. నీకు ఫోన్ చేయడానికి వీలు పడి ఉండదు. అంతే"

"అంతేనంటావా?" వదిన నా వైపు తడి కళ్ళతో బేలగా చూసింది. కొన్ని క్షణాల విరామం తర్వాత అభ్యర్థనగా చూస్తూ "మనం నిజామాబాద్ వెళ్ళొస్తే మంచిదేమోననిపిస్తోంది" అంది.

"అలాగే వదినా. నీ మనశ్శాంతి కోసం వెళ్దామంటే నేను రెడీ" అన్నాను.

"యిప్పుడే బయల్దేరుదాం"

భార్యగా ఆమె పడ్తున్న ఆదుర్దా అర్థమై "సరే వదినా... కార్లోనే వెళ్దాం పద" అన్నాను.

నిజామాబాద్ చేరుకోగానే పోలీస్ స్టేషన్లో వాకబు చేశాం. మార్చురీలో ఉన్న శవాన్ని చూపించారు. అన్నదే. వదినా నేను అన్న శవం మీద పడి ఎంత ఏడ్చినా దుఃఖం తీరటం లేదు. ఈ బాధ, దుఃఖం ఎప్పటికైనా తీరేటివా? మా అన్నను నక్సలైట్ అనుకుని చంపేయటమేమిటి? ప్రజల కోసం నిస్వార్థంగా పాటుపడే మనిషిని అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారే ఈ పోలీసులు... చీమకుట్టా హాని తలపెట్టని మనిషిని అమానుషంగా కాల్చేశారే...

అప్పటికే మానవ హక్కుల సంఘం నేతలు అక్కడ గుమికూడి పోలీసు జులుం నశించాలని నినాదాలు చేస్తున్నారు. ఓ అమాయకుణ్ణి నక్సలైటనే ముద్ర వేసి బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపారని పోలీసుల మీద దుమ్మెత్తిపోస్తున్నారు. గాంధి నక్సలైటనడానికి తమ దగ్గర ఆధారాలున్నాయని పోలీసులు వాదిస్తున్నారు.

పత్రికలవాళ్ళు, టీవీ మీడియావాళ్ళు వదిన్ని చుట్టుముట్టి ప్రశ్నలేస్తున్నారు. "నా భర్త నక్సలైట్ కాదు. మానవతా వాది. మంచి మనిషి. సమాజాన్ని తనకు చాతనైనంతగా ఉద్ధరించాలని కంకణం కట్టుకున్న కర్మజీవి. పేదల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన శ్రామికుడు. నా భర్తని అన్యాయంగా చంపేశారు" కోపాన్ని అదుపులో పెట్టుకోలేక పెద్ద పెద్దగా అరుస్తోంది వదిన. మధ్య మధ్యలో ఏడుస్తోంది. కన్నీళ్ళు తుడుచుకుని మళ్ళా పోలీసుల అకృత్యాన్ని వివరిస్తోంది.

"అతని భుజానికున్న సంచిలో విప్లవ సాహిత్యం దొరికింది. అతను నక్సలైట్ కాకపోవడమేమిటి? ఈ ఫొటోలో శవం పక్కన పడి ఉన్న తుపాకీ అతనిదే" మేం జరిపిన ఎదురు కాల్పుల్లో చనిపోయాడు. మీడియా కావాలని రాద్ధాంతం చేస్తోంది" పోలీసులు గట్టిగా వాదిస్తున్నారు.

"నేను వీళ్ళని వదలను. కోర్టుకీడుస్తా. నా భర్త నక్సలైట్ కాదని నిరూపిస్తా. నా భర్త చావుకి కారణమైన వీళ్ళని ఉరిశిక్ష పడేవరకు పోరాడుతా" వదిన టీవీ వాళ్ళతో అంటోంది.

ఓసారి నక్సల్‌బరీ ఉద్యమం గురించి మా అన్నకు నాకు మధ్య జరిగిన సంభాషణ గుర్తొస్తోంది.

మందు పాతర పెట్టి పోలీసు వ్యాన్‌ని పేల్చేశారు నక్సలైట్లు. ఆ సంఘటనలో పాతిక మంది పోలీస్ జవాన్లు చచ్చిపోయారు. ఆ రోజు అన్నను చూసొద్దామని యింటికెళ్ళాను. అన్న చుట్టూ ఓ డజను మంది కూచుని ఉన్నారు. సంభాషణ మందుపాతర పేలుళ్ళలో చనిపోయినవారి కుటుంబాల గురించి సాగుతోంది.

"నేను కాలేజీ చదువులకొచ్చిన కొత్తలో నక్సల్‌బరీ పోరాటాన్ని గురించి విన్నప్పుడు నరాల్లోకి కొత్త నెత్తురేదో ప్రవహిస్తున్నట్లుండేది. దౌర్జన్యాలు చేసే భూస్వాముల్ని, పెత్తందారుల్ని, పేదల రక్తం పీల్చే జలగల్ని ఏరి పారేయటం అనే వూహే చాలా అందంగా ఉండేది. సమసమాజం నవసమాజం కనుచూపుమేర దూరంలో కళ్ళకు రంగు రంగుల కాంతుల్లో కన్పించేవి. కానీ ఆ కలలన్నీ కేవలం కలలుగానే మిగిలిపోయాయి. ఉద్యమం పక్కదారి పట్టింది"అన్నాడు గాంధి.

"వాళ్ళు అడవుల్లో కొండల్లో దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ పోరాడుతున్నది మనకోసమే కదన్నా" అన్నాను.

"నిజమే. కానీ పోస్టాఫీసుల్ని, టెలిగ్రాఫ్ ఆఫీసుల్ని, రైలు పట్టాల్ని ధ్వంసం చేయటం వల్ల నష్టపోయేది సామాన్య మానవుడేనన్న విషయం ఎందుకు విస్మరిస్తున్నారు? వాటిని పునర్నిర్మించడానికయ్యే ఖర్చు మనమే కదా పన్నుల రూపంలో భరించేది...పోలీసు జవాన్లని చంపటం వల్ల ఏం సాధించాలనుకుంటున్నారు? పైఅధికార్ల ఆజ్ఞాను సారం నడుచుకోవటం తప్ప వాళ్ళకు స్వంత వ్యక్తిత్వం, స్వంత ఆలోచన ఉండవనే విషయం వీళ్ళకి తెలీదా... అనాథలైన వాళ్ళ పిల్లల గతేమిటి? విధవలైన ఆ స్త్రీలు ఏం పాపం చేశారని ఈ శిక్ష? ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమూ తప్పే. గ్రీన్ హంట్ పేరుతో చేస్తున్నది దమనకాండ కాక మరేమిటి?" అన్నాడు.

దుర్మార్గుల్ని చంపితే... న్యాయ శాస్త్రాల ప్రకారం అది నేరమే ఐనా... సమాజంలోని మెజారిటీ వర్గం దాన్ని హర్షిస్తుంది. కానీ అమాయకుల్ని చంపితే... వూర్కుంటుందా? అందునా మంచివాళ్ళని చంపితే... మా అన్న మంచివాడు.

గాంధి నక్సలైట్ అని పోలీసులంటున్నారు. కాదని నిరూపించడానికి తన సర్వశక్తులూ ఒడ్డి పోరాటానికి సమాయత్తమౌతోంది వదిన.

సమాజ శ్రేయస్సు కోసం పాటు పడేవాళ్ళనీ, పేదల కోసం పోరాడేవాళ్ళని, దీనుల హీనుల పక్షాన మాట్లాడేవాళ్ళని, మార్పు కోసం కలల కనేవాళ్ళని ఈ పోలీసులు నక్సలైట్లనటంలో ఆశ్చర్యమేముంది? ఆ రకంగా ఆలోచిస్తే మా అన్న గాంధి కూడా నక్సలైటే.

అలా అనుకోగానే అంత దుఃఖంలోనూ నా రెండో కూతురడిగిన ప్రశ్న గుర్తొచ్చింది. పేదల కోసం పోరాడేవాళ్ళు, సమాజాభ్యుదయం కోసం పాటు పడేవాళ్ళందరూ నక్సలైట్లయితే... నక్సలైట్లందరూ పేదల కోసం పోరాడుతూ సమాజాభ్యుదయం కోసం పాటు పడ్తున్నవాళ్ళు అనే వాక్యం సరైందా కాదా అనే ప్రశ్నకు సమాధానం కావాలి. •